# నాలుగు మండలాలకు తహసిల్దారులు ఉన్నట్లా.. లేనట్లా..?

## వద్దన్న వారికి ఇంచార్జి బాధ్యతలు .. ఎన్నికల కమిషన్ కు సమాచారం ఉందో..లేదో..?



**నిజామాబాద్, బతుకమ్మ:** నిజామాబాద్ జిల్లాలో నాలుగు మండలాల్లో తహసిల్దారులు ఉన్నాట్లా .. లేనట్లా.. అనే సందేహాలు రెవిన్యూ వర్గాల్లో నెలకొన్నాయి. జిల్లా వ్యాప్తంగా బదిలీలు జరిగినప్పటికీ ఈ మండలాలను భర్తీ చేయలేకపోయారు. ఎస్ఐఆర్ ప్రారంభానికి ముందు కమిషన్ ఆదేశాల ప్రకారం జిల్లా వాసులు మండలాదికారులుగా ఉండరాదనే నిబంధనలు ఉన్నాయని సంబంధిత ఉద్యోగులే స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికీ డిప్యూటీ లకు ఇంచార్జ్ లుగా భాధ్యతలు అప్పగించడంపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి.

**గోప్యతపై అనుమానాలు:**

నిజామాబాద్ రూరల్,నిజామాబాద్ నార్త్, ఎడపల్లి,రెంజల్ మండలాల్లో డిప్యూటీ తాహసిల్దార్లే ఇంచార్జ్ తహసిల్దార్లు గా బాధ్యతలను నిర్వర్తిస్తు న్నారు. ఇందులో నిజామాబాద్ నార్త్,రెంజల్, ఎడపల్లి తహసీల్దార్ లు హైదరాబాద్ కు డిప్యూటేషన్ పై వెళ్లారు. వీరి స్థానంలో డిప్యూటీ లకు ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.

**వద్దన్న వారికి:**
నిజామాబాద్ రూరల్ లో చేస్తున్న డిప్యూటీ తహసిల్దార్ ను ఎన్నికల సమయంలో సొంత జిల్లాకు వెళ్ళాలని సూచిస్తే,ఇక్కడే ఉంటానని వెళ్ళలేక పోయడు. పక్క జిల్లాలో ఉన్న నిజామాబాద్ వాసులు మాత్రం సొంత జిల్లాకు చేరుకున్నారు. ఇక్కడే ఉంటానని చెప్పినప్పుడు స్థానికత కిందకు వస్తుందని,అలాంటప్పుడు రూరల్ లో ఇంచార్జ్ తహసీల్దారుగా ఎలా నియమిస్తారనే ప్రశ్నలు వెలువడుతున్నాయి.

**జక్రాన్పల్లి డిటి కి ఎడపల్లి ఇంచార్జ్:**

నిజామాబాద్ నార్త్, రెంజల్ మండలాల్లో అందు లోనే ఉన్న డిటి లకు ఇంచార్జ్ బాధ్యతలు ఇచ్చారు. ఎడపల్లి లో మాత్రం స్థానిక డిటి కి ఇవ్వకుండా జక్రాన్పల్లి డిటి కి ఇంచార్జ్ తహసిల్దార్ గా నియమించారు. తాత్కాలిక తహసిల్దార్ గా జగిత్యాల్ జిల్లాకు వెళ్ళాలని సూచిస్తే తానూ వెళ్లనని స్పష్టం చేసిన డి టి కి ఎడపల్లి మండలానికి తహసిల్దార్ గా పంపడం పై చాటుమాటు వ్యవహారాలు నడిచాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**బోధన్ డీటీ కి రెంజల్ ఇంచార్జ్:**

రెంజల్ మండలం తహసిల్దార్ హైదరాబాద్ కు డిప్యూటేషన్ పై వెళ్లారు. అక్కడే ఉన్న డి టి ని కాదని బోధన్ ఆర్ డి ఓ లో ఉన్న డీటీ కి రెంజల్ మండలం ఇన్చార్జి తహసిల్దార్ గా నియమించారు.

**ఎన్నికల కమిషన్ కు ..?**
అన్ని మండలాల్లో సొంత జిల్లా వారు గాకుండా పక్క జిల్లా వారు మండలాదికారులుగా ఉండాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు చెబుతున్నాయి. ఈ నాలుగు మండలాల స్థానిక డిప్యూటీల గురించి




ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) సమయంలో ఎన్నికల కమిషన్ కు రెవిన్యూ అధికారులు ఏమని చెబుతారోననే ఉత్కంట అందరిలోనూ నెలకొంది. ఇదంతా కలెక్టరేట్ లోని కొందరి అండదండలతోనే జరుగుతోందనే అను మానాలు రెవిన్యూ సిబ్బంది చర్చించుకుంటున్నారు.

# ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్ట్



హైదరాబాద్, బతుకమ్మ
మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని బంజారాహిల్స్ పోలీస్ లు మంగళవారం ఉదయం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి కానిస్టెన్సీ పరిధిలో మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్ ఆధ్వర్యంలో తడ్వాయి మండల కేంద్రంలో బీయర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న యూరియా యాప్ రద్దు ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతుండగా స్థానిక పోలీసులు అడ్డుకొని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ ముందస్తు అరెస్ట్ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యూరియా యాప్ వాళ్ళ రైతులు పడుతున్న ఇబ్బందిని తొలగించేందుకు శాంతి యుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించేందుకు వెళ్తుంటే పోలీసులు హైదరాబాద్ లో అడ్డుకోవడం విడ్డురంగా ఉందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసన చేస్తే కూడా ముందస్తు అరెస్ట్ లు చేయడం అన్యాయం అన్నారు. ప్రొటెస్ట్ ప్రోగ్రాం కు వెళ్తుంటే అరెస్ట్ ఏంటని ఆయన పోలీసులను ప్రశ్నించారు. రైతులకు కోసం తాను వెళ్ళాల్సిందేనని ఆయన పోలీసులతో వాగ్వివాధానికి దిగారు. ఢిల్లీకి 72 సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెట్రో రైలు పైన సమావేశాలు పెట్టడానికి సమయం ఉంటుంది కానీ, కేంద్ర ప్రభుత్వాన్ని యూరియా గురించి అడిగే శ్రద్ధ లేదన్నారు. రేవంత్ రెడ్డికి రైతులంటే చాలా చులకన భావం ఉందని విమర్శించారు. అటు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా రాష్ట్రానికి రావాల్సిన యూరియాను ఒకేసారి ఇవ్వకుండా కోతలు విధిస్తోందని, ఇటు రేవంత్ రెడ్డికి కేంద్రం నుండి తెచ్చుకునే తెలివి లేదని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలుగా తాము రైతుల బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుంటే వినే ఓపిక లేకపోగా, రివర్స్‌లో అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. అటు నరేంద్ర మోదీ, ఇటు రేవంత్ రెడ్డి.. ఈ రెండు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా విషయంలో, వడ్ల కొనుగోలు విషయంలో తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నాయని ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతులకు ఇబ్బందిగా మారిన యూరియా యాప్ ను వెంటనే రద్దు చెయ్యాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# వీధి వ్యాపారులకు అండగా పీఎం స్వనిధి






## మహిళల్లో చైతన్యం పెరిగింది
## స్వనిధి మహోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :
వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం అండగా నిలుస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని న్యూ అంబేద్కర్ స్వనిధి మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు మధ్యతరగతి కుటుంబాలకు వ్యాపారం నిర్వహించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రుణాలను అందజేస్తుందన్నారు. ఇందులో భాగంగా మొదటిసారి రూ. 10 వేలు ఇస్తారని, వాయిదాలు క్రమంగా చెల్లిస్తే అంతకు మించి రుణాలను ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆత్మ నిర్భర్ భారత్ లో భాగంగా విధి వ్యాపారులకు అండగా నిలుస్తున్నారన్నారు. మహిళలు రుణాలు పొందడంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, నగరవాసుల్లో మరింత చైతన్య పెరిగింది అన్నారు. అనంతరం మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. డిజిటల్ పే చేసి పలు వస్తువులను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, బీజేపీ కార్పొరేటర్లు బట్టు రాఘవేందర్, మఠం పవన్, జ్యోతి మురళి, కల్పే అర్చనా చిరంజీవి, బంటు ప్రీతి ప్రవీణ్, సువర్ణ వేణుగోపాల్, మెప్మా డీఎంసీ మాధురి లత, ఏడీఎంసీ నందన్ రెడ్డి, సీవో లు శోభారాణి, అర్చన, ఆయా బ్యాంక్ మేనేజర్లు, పాల్గొన్నారు.

# 50 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్సై



వెబ్ డెస్క్, బతుకమ్మ :
స్టేషన్ బెయిల్ భవిష్యత్తులో ఎలాంటి కేసులు పెట్టకుండా ఉండేందుకు కేసు నమోదైన వ్యక్తి నుంచి రూ.50 వేల లంచం తీసుకుంటూ ఎస్సై ఏసీబీకి పట్టుబడ్డారు. గాంధీనగర్ పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా పనీ చేస్తున్న నర్సింలు మంగళవారం ఓ వ్యక్తి నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖాధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. గాంధీనగర్ పోలీస్ స్టేషన్ లో నమోదైన ఓ కేసు విషయంలో ఎస్సై నర్సింలు స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి కేసులు పెట్టి వేదించకుండా ఉండాలంటే లక్ష రూపాయల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దానితో బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. మొదటి విడతలో రూ.50 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు నర్సింలును రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం గాంధీనగర్ పోలీస్ స్టేషన్ లో సోదాలు నిర్వహించారు. నర్సింలు పై కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ కు తరలించారు.

# అధికారులు తీరు మార్చుకోవాలి..

... అలసత్వం వహిస్తే ఊరుకునేది లేదు
... పనుల్లో పురోగతి సాధించాలి
... కార్పోరేషన్ ఆయా విభాగాధికారులతో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సమావేశం

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :
కార్పొరేషన్ లోని అన్ని విభాగాల అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా స్పష్టం చేశారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఒక్కో విభాగాల వారీగా ఆయా అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది ఏ మాత్రం అలసత్వం వహించినా ఊరుకునేది లేదన్నారు. ప్రధానంగా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ లో అనేక ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ నిర్మాణాలపై కొరడా జులుపించాలని చెప్పారు. కొందరు సిబ్బంది అలసత్వంతో పనిచేస్తున్నారని, అటువంటివారు తమ తీరును మార్చుకోవాలని తెలిపారు. అలాగే ఇంజనీరింగ్ అధికారులు నగరంలో కొనసాగుతున్న పనులతో పాటు స్ట్రీట్ లైట్, పచ్చదనంపై దృష్టి సారించాలన్నారు. అలాగే కొనసాగుతున్న పనులు తొందరగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలం ని దృష్టిలో పెట్టుకుని శానిటేషన్ విభాగం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. పలు డివిజన్లో డ్రైనేజీ వ్యవస్థపై, చెత్త సేకరణ పై ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో, పెద్ద డ్రైనేజీల్లో అవసరమైతే జేసీబీ లు వినియోగించాలన్నారు. గతంలో జరిగిన నష్టాలను దృష్టిలో పెట్టుకొని పని చేయాలని తెలిపారు. మరో నెల రోజుల్లో మళ్లీ అన్ని విభాగాలతో సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, ఆయా విభాగాధికారులు పాల్గొన్నారు.

